సాక్షి
వైఎస్సార్ జిల్లా
బుధవారం, 22, మే, 2024



తాటి ముంజెలు.. లాభాలు బోలెడు

వేసవి తాపం నుంచి సేద తీరేందుకు జనాలు తాటి ముంజలు కొనుగోలు చేస్తున్నారు. వీటితో లాభాలున్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. - 8లో



గడువు దాటిన సిలిండర్‌తో జాగ్రత్త!

కాలం చెల్లిన గ్యాస్ సిలిండర్ వినియోగించడం ప్రమాదకరం. వినియోగదారులు దీనిపై అవగాహన పెంచుకుంటే ప్రమాదం నుంచి బయటపడే అవకాశం ఉంది. -8లో

గరిష్టం/కనిష్టం 37.2/26.2

వాతావరణం

జిల్లాలో మంగళవారం 26.2 - 37.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. -కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

జిల్లాలో వర్షం



కడప అగ్రికల్చర్: ఉపరితల ఆవర్తనంతో జిల్లాలోని పలు మండలాల్లో వర్షం కురిసింది. ఇందులో పులివెందుల్లో అత్యధికంగా 29 మి.మీ వర్షం కురిసింది. అలాగే చక్రాయపేటలో 27 మి.మీ, రాజుపాలెంలో 14.8, మైలవరంలో 9.6, బద్వేల్‌లో 9, గోవపరంలో 7.6 , సీకేదిన్నెలో 6.4, కడపలో 2.8 , వేములలో 2, దువ్వూరులో 1.6 , వేంపల్లిలో 1.2 మి.మీ వర్షం కురిసింది.

ఘనంగా ధ్వజారోహణం



ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న పండితులు

జమ్మలమడుగు: పట్టణంలోని టీటీడీ నారాపుర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ధ్వజారోహణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం తిరుమల తిరుపతికి చెందిన వేద పండితులు గుడి ముందు ఉన్న ధ్వజ స్థంభానికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. సాయంత్రం స్వామి వారిని పెద్ద శేష వాహనంపై పురవీధుల గుండా గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

రేపు పుష్పగిరి క్షేత్రానికి ప్రత్యేక బస్సు



కడప కోటిరెడ్డి సర్కిల్: పౌర్ణమి సందర్భంగా ఈనెల 23వ తేదీన జిల్లాలోని పుష్ప గిరి క్షేత్రానికి ప్రత్యేక బస్సు సర్వీసును ఏర్పాటు చేసినట్లు కడప డిపో మేనేజర్ డిల్లీశ్వరరావు తెలిపారు. ఈ ప్రత్యేక బస్సు గురువారం ఉదయం 6 గంటలకు కడప పాత బస్టాండు నుంచి బయలుదేరుతుందన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సాహస పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

కడప స్పోర్ట్స్: భారత ప్రభుత్వం, యువజన సర్వీసులు, క్రీడల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'టెన్సింగ్ నార్గే' జాతీయ సాహస పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్టెప్ సీఈఓ సి. సాయిగ్రేస్ తెలిపారు. భూమి, నీరు, వాయు విభాగాల్లో సాహసకృత్యాలు చేసిన వారికి ఈ పురస్కారాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అర్హులైన వారు అవార్డ్స్.జీఓవి.ఇన్ వెబ్‌సైట్ ద్వారా జూన్ 14లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు స్టెప్ మేనేజర్ వి.వి. సుబ్బారాయుడు 9949298810, టి. నాగయ్య 9849497011 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

నేడు కేవీకేలో పసుపు వేలం



మైదుకూరు: మైదుకూరు మండలం వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రంలో బుధవారం పసుపు పంట వేలం నిర్వహించనున్నట్లు కేంద్రం అధిపతి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం .బాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం మధ్యాహ్నం 2.30 గంటలకు నిర్వహించే వేలంలో పాల్గొనేవారు ముందుగా రూ.100 చెల్లించి టోకెన్ తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. వివరాలకు కేవీకే అధిపతి బాలకృష్ణ (9985666503), కేంద్రం విస్తరణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ శ్రీవిద్యారాణి (9398982828)లను సంప్రదించాలని సూచించారు.

గ్రామీణ విద్యార్థులకు ప్రోత్సాహం

కడప సెవెన్‌రోడ్స్: సివిల్స్, ఐఐటీ, నీట్ వంటి ఉన్నత చదువులకోసం గ్రామీణ విద్యార్థులకు తమవంతు సహకారం అందిస్తామని పారా అసోసియేషన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ సంస్థ అధ్యక్షుడు లక్ష్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత కార్పొరేట్ ప్రపంచంలో ఇలాంటి ఉన్నత చదువును గ్రామీణ పేద విద్యార్థులు అందుకోవాలన్న ఉద్దేశ్యంతోనే తాము కృషి చేస్తున్నామన్నారు. గుంటూరు జిల్లా వినుకొండలోని భ్రమరా టౌన్‌షిప్‌లో 6నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఈనెల 26వ తేది ఉదయం 9.00 గంటలకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి అదేరోజు ఫలితాలు వెల్లడిస్తామన్నారు. అర్హత సాధించిన విద్యార్థులకు 100 శాతం నుంచి 50 శాతం వరకు స్కాలర్‌షిప్ ఇస్తామన్నారు. ఆసక్తిగల వారు 93906 11867 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

తెలుగు పదానికి జన్మదినం..

జానపదానికి జ్ఞానపథం

అదివో అల్లదివో శ్రీవారి వాసము పదివేల శేషుల పడగలమయం... లాంటి కీర్తనలతో పదకవితా పితామహుడుగా తాళ్లపాక అన్నమాచార్యులు శ్రీవారి భక్తుల హృదయాల్లో చెరగని ముద్రవేసుకున్నాడు. అన్నమాచార్యుడి 614వ జయంతి సందర్భంగా సాక్షి అందిస్తున్న ప్రత్యేక కథనం...

- తొలి తెలుగు వాగ్గేయకారుడు అన్నమయ్య
- 23 నుంచి అన్నమాచార్యుని జయంతి ఉత్సవాలు
- అటు తాళ్లపాక, ఇటు 108 అడుగుల అన్నమయ్య విగ్రహం వద్ద ఉత్సవాలు



తాళ్లపాకలోని అన్నమాచార్య ధ్యానమందిరం

రాజంపేట: తెలుగుసాహితీ చరిత్రలో లభించిన ఆధారాల ప్రకారం మొదటి వాగ్గేయకారుడు అన్నమయ్య. ఆయనకు పదకవితాపితామహుడు అని బిరుదు ఉంది. దక్షిణాపథంలో భజన సంప్రాదాయానికి పదకవితాశైలికి ఆద్యుడు. గొప్ప వైష్ణవభక్తుడు..

- భాగవతసేవా పరాయణులైన నారాయణసూరి, లక్కమాంబలకు సంతానం లేకపోవడంతో ఏడుకొండలస్వామిని మొక్కుకున్నారు. తిరుమలకు చేరుకున్న ఈ దంపతులు స్వామి మందిరంలోకి ప్రవేశించారు. గరుడస్తంభం వద్ద సాగిలి మొక్కారు. వెంకటేశ్వర స్వామి తన నిజఖడ్గమైన నందకాన్ని ఆ పుణ్యదంపతులకు ప్రసాదించాడు. వాళ్లు పరమానంద భరితులయ్యారు. వెంకటపతిని దర్శించి స్తుతించారు. సంతోషంతో తాళ్లపాకకు తిరిగివచ్చారు. 1408 మే 9న రాజంపేట మండలం తాళ్లపాకలో అన్నమయ్య జన్మించాడు. తన ఎనిమిదవ యేట అన్నమయ్యకు ఆయన గురువు ఘన విష్ణుదీక్ష నొసిగినప్పుడు అన్నమాచార్య నామం స్థిరపడింది.



ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు శ్రీహరి నారాయణ చార్యులు. ఈయనను తాళ్లపాక స్వామి అని కూడా పిలుస్తారు. 12వ తరానికి చెందిన వారు. వీరి కుటుంబీకులు తిరుమలలో శ్రీవారి ఆలయంలో సంకీర్తన కైంకర్యపరులుగా కొనసాగుతున్నారు. అన్నమయ్య వారసులుగా శ్రీవారి నిత్య కైంకర్యాలలో చేసుకునే మహాభాగ్యం మా కుటుంబీకులకు మహాఅద్భుతమైన అవకాశంగా భావిస్తున్నామని హరిస్వామి చెబుతున్నారు.

అన్నమయ్య తిరుమల పయనం..

అన్నమయ్య ఇంటిలో తల్లి సంగీతం, తండ్రి పాండిత్యం ఛాయలతో పెరిగాడు. ఉపవీత సంస్కారం పొందిన తర్వాత ఇంటి గురుకులంలో విద్యాభ్యాసం కొనసాగింది. ఏకసంధాగ్రహి అయినందున అనతికాలంలో ఉన్నత విద్యావంతుడయ్యాడు. తన పదహారవ యేట అన్నమయ్యకు శ్రీ వెంకటేశ్వర దర్శనానుభూతి కలిగింది. అప్పటి నుంచి అన్నమయ్య అద్భుతమైన కీర్తనలు రచింపసాగాడు. వేడుకుందామా వెంకటగిరి వెంకటేశ్వరుని..అంటూ భక్తబృందంతో కలిసి అన్నమయ్య తిరుమలకు పయనమయ్యాడు. వెంకటేశ్వరుని కీర్తిస్తూ తిరుమలలోనే జీవితం గడిపాడు.

సంసారం..సంకీర్తనం

తిరుమల నుంచి తాళ్లపాకకు చేరుకున్న అన్నమయ్యకు తిమ్మక్క, అక్కమ్మ అనే పడతులతో వివాహం జరిగింది. వైవాహిక జీవితంలో పడిన అన్నమయ్య ఒకరోజు తన ఇద్దరు భార్యలతో తిరుమలకు చేరుకున్నారు. ఆ సమయంలోనే శ్రీ వేంకటపతిపై రోజుకొక సంకీర్తన వినిపించాలని సంకల్పించాడు. అప్పటి నుంచి అన్నమయ్య పుంఖానుపుంఖాలుగా కీర్తనలు చెప్పారు. అతని శిష్యులు వాటిని గానం చేస్తూ తాళపత్రాలకు ఎక్కించారు. భార్యలతో కలిసి తీర్థయాత్రలకు బయలుదేరారు. ముందుగా తన స్వగ్రామంలోని చెన్నకేశవుని అర్చించారు. మార్గంలోని నందలూరు సౌమ్యనాథుడు, ఒంటిమిట్టి రామయ్య, కడప వెంకటరమణుని, చాగలమర్రి చెన్నకేశవున్ని, అహోబిలం నృసింహస్వామిలను దర్శించుకుని కీర్తనలు ఆలపించారు. వైష్ణవ క్షేత్రాలను దర్శించుకుంటూ, తను ఆలపించిన కీర్తనలు అంతటా ప్రసిద్ధి చెందాయి.



అన్నమయ్య కీర్తనలు..రచనలు..

అన్నమయ్య సంకీర్తనా సేవ సంగీత, సాహిత్య, భక్తి పరిపుష్టం. తెలుగు వ్యావహారిక భాష, దేశి సంగీత విధానాలు రెండు అతని రచనలలో ఉన్నాయి. లభించిన వాటిలో తొలి సంకీర్తనలు కనుక అన్నమయ్య సంకీర్తనాచార్యుడు, పదకవితాపితామహుడు అయ్యాడు. 32వేల కీర్తనలు ఆలపించారు. అలుమేలు మంగ, శ్రీనివాసుల కీర్తనలకు తన జీవితాన్ని అంకితం చేసిన పరమ భక్తుడు అన్నమ య్య. రచనలలో భక్తి, సంగీతం , సాహిత్యం, శృంగారం, వేదాంతము అత్యంత మనోహరంగా వినసొంపుగా ఉన్నా యి. దక్షిణాపథంలో భజన సంప్రదా యానికి అన్నమయ్యే ఆద్యుడు.

23 నుంచి 25 వరకు అన్నమయ్య జయంత్యుత్సవాలు

ఈనెల 23 నుంచి 25 తేదీ వరకు అన్నమయ్య 616వ జయంత్యుత్సవాలను టీటీడీ నిర్వహిస్తోంది. తాళ్లపాక, అన్నమయ్య 108 విగ్రహం వద్ద సంగీత, నృత్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 23న తాళ్లపాకలో అన్నమయ్య ధ్యానమందిరం వద్ద ఉదయం 9 గంటలకు గోష్టిగానం, సప్తగిరి సంకీర్తనలు ఉంటాయి. 10.30 గంటలకు శ్రీవారి కళ్యాణం నిర్వహించనున్నారు.

భూమన, వైవీ సుబ్బారెడ్డి హయాంలో జన్మస్థలికి మహర్దశ

టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి హయాంలో తాళ్లపాక అన్నమాచార్యుల జన్మస్థలికి మళ్లీ మహర్దశ కలిగిందనే చెప్పవచ్చు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో తాళ్లపాక, 108 అడుగుల అన్నమయ్య విగ్రహం ఏర్పాటు జరిగాయి. నభూతో నభవిష్యతి అన్న రీతిలో అన్నమయ్య 600వ జయంత్యుత్సవాలు జరిగాయి. సీఎం వైఎస్ జగన్ పాలనలో టీటీడీ చైర్మన్‌గా ఉన్న వైవీ సుబ్బారెడ్డి, ప్రస్తుత చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి మళ్లీ ధీంపార్కు, అన్నమయ్య ధ్యానమందిర పునఃనిర్మాణానికి మోక్షం లభించింది.

పేరు:	తాళ్లపాక అన్నమాచార్యులు
జననం:	1408 మే 09
మూలం:	తాళ్లపాక
మరణం:	1503 ఫిబ్రవరి 23, తిరుపతి
సంగీతశైలి:	కర్ణాటక సంగీతం
వృత్తి:	రచయిత, యోగి, స్వరకర్త, కవి, పదకవితాపితామహుడు
వాయిద్యాలు:	తంబూర

అన్నమయ్య నడయాడిన ప్రాంతం పుణ్యస్థలి



తాళ్లపాక అన్నమాచార్యులు నడియాడిన ప్రాంతం పుణ్యస్థలం. అన్నమాచార్యుల జన్మస్థలి అభివృద్ధికి టీటీడీ కృషి చేస్తోంది. దివంగత సీఎం వైఎస్ఆర్ ఆవిష్కరించిన 108 అడుగుల అన్నమయ్య అడుగుల విగ్రహం రాజంపేటకే ల్యాండ్‌మార్క్‌గా నిలిచింది. ఇప్పుడు శ్రీవారి ఆలయం నిర్మాణం భక్తులకు వరం. -మేడా రామకృష్ణారెడ్డి, మాజీ డైరెక్టర్, టీటీడీ బోర్డు, రాజంపేట

మూడురోజుల పాటు జయంత్యుత్సవాలు



మూడు రోజులపాటు తాళ్లపాక, 108 అడుగుల అన్నమయ్య విగ్రహం వద్ద అన్నమాచార్యులు జయంత్యుత్సవాలను టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. సంస్కృతి, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అన్నమయ్య జన్మస్థలిలో తొలిరోజున శ్రీవారి కళ్యాణం నిర్వహించనున్నారు. -నటేష్‌బాబు, డిప్యూటీ ఈఓ, టీటీడీ, తాళ్లపాక

లాహిరి లాహిరి లాహిరిలో!



విశేష అలంకారంలో స్వామి, అమ్మవార్లు



తెప్పపై స్వామి, అమ్మవార్ల జలవిహారం

కడప కల్చరల్: కడప రాయుడు శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయ పుష్కరిణిలో ఆనందంగా విహరించాడు. కనుల పండువగా అలంకరించిన తెప్పపై ప్రియ భక్తురాలు ఇష్టసఖి గోదాదేవి సమేతంగా దివ్యాలంకారంలో మెరిసిపోతూ జలవిహారం చేశారు. కోనేటిలోని చిన్ని చిన్ని అలల మధ్య.. మంగళవాయిద్యాలు.. మంత్రోచ్చరణల నడుమ విహరించాడు. జిల్లాలో ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతమైన తిరుమల తొలిగడప దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ పుష్కరిణి ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు టీటీడీ అధికారులు స్థానిక ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి పర్యవేక్షణలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి కార్యక్రమాలను ప్రారంభించారు. టీటీడీ కళాకారుల అన్నమాచార్యుల కీర్తనల ఆలాపనలు అలరించాయి. అనంతరం స్వామి, అమ్మవార్లకు నైవేద్యం సమర్పించి దాన్ని ప్రసాదంగా భక్తులందరికీ అందజేశారు.

'మను'లో అడ్మిషన్లకు గడువు పొడిగింపు

కడప ఎడ్యుకేషన్: కడప నగర శివార్లలోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ పాలిటెక్నిక్ కళాశాలలో అడ్మిషన్ల గడువు మే 30వ తేదీ వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ అబ్దుల్ ముఖ్సిత్‌ఖాన్ తెలిపారు. పదవ తరగతి రెగ్యులర్ లేదా ఓపెన్‌లో ఉర్దూ మీడియం లేక ఉర్దూ సబ్జెక్టు చదువుకొని ఉంటే దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని తెలిపారు. రెండవ సంవత్సరం పాలిటెక్నిక్‌లో చేరాలనుకునేవారు రెండేళ్ల ఐటీఐ లేకపోతే ఇంటర్మీడియట్ చదివి ఉండాలని తెలిపారు. ఇందుకు సంబంధించిన ప్రవేశ రాత పరీక్ష జూన్ 12వ తేదీ మధ్యాహ్నం కడప క్యాంపస్‌లో ఉంటుందని తెలిపారు. పరీక్ష ఆధారంగా ర్యాంకు ద్వారా సీట్లు భర్తీ చేస్తామని తెలిపారు. మెకానికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, అప్పరెట్ టెక్నాలజీ కోర్సులు ఉన్నాయని వివరించారు. అబ్బాయిలకు అప్లికేషన్ ఫీజు రూ.550, అమ్మాయిలకు రూ. 350 చెల్లించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు htpps://manuu coe.in/regularAdmision ద్వారా సమాచారం తెలుసుకోవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు 9398083058 నెంబర్‌లో సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

గండి నిత్యాన్నదానానికి రూ. లక్ష వితరణ



దాతలకు స్వామి వారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఆలయ అధికారి ముకుందరెడ్డి

చక్రాయపేట: గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన పథకానికి మంగళవారం ఓ భక్తుడు రు.1,00,116లు విరాళంగా అందజేసినట్లు ఆలయ సహాయకమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి పేర్కొన్నారు. కొండాపురం మండలం తాళ్ల ప్రొద్దుటూరుకు చెందిన రెండెద్దుల నాగేశ్వరరెడ్డి, సతీదేవి దంపతులు వారి కుటుంబ సభ్యులతో కలసి విరాళం అందజేశారని చెప్పారు. ఈసందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు రాజారమేష్ దాతలచే స్వామి వారికి ప్రత్యేక పూజలు చేయించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అలాగే స్వామి వారి చిత్రపటాన్ని బహూకరించి శేష వస్త్రంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కావలి కృష్ణతేజ పాల్గొన్నారు.

కౌంటింగ్ ప్రక్రియకు సన్నాహాలు

- ఒక్కో నియోజకవర్గం, సెగ్మెంట్‌కు 14 చొప్పున టేబుళ్లు
- 18 నుంచి 22 రౌండ్లలో ఓట్ల లెక్కింపు
- ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 22,669 పోస్టల్ బ్యాలెట్లు



ఓట్ల లెక్కింపు జరిగే పాలిటెక్నిక్ భవనం



కమలాపురం: ఎన్నికల కౌంటింగ్‌పై పోలీస్ స్టేషన్‌లో సమీక్ష నిర్వహిస్తున్న ఎస్పీ సిద్దార్థ్ కౌశల్

కడప సెవెన్‌రోడ్స్: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో చివరిది, కీలకమైనదైన ఓట్ల లెక్కింపు జూన్ 4వ తేది జరగనుంది. కడప సమీపంలోని మౌలాన అబుల్ కలాం ఆజాద్ పాలిటెక్నిక్ కళాశాల ఇందుకు వేదిక కానుంది. ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా, సజావుగా సాగేందుకు జిల్లా యంత్రాంగం అవసరమైన సన్నాహాల్లో నిమగ్నమైంది. జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకుగాను 1963 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఈ మొత్తం పోలింగ్ కేంద్రాలకుగాను 144 రౌండ్లలో ఓట్ల లెక్కింపు పూర్తి చేస్తారు. జిల్లాలో ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి 14, సెగ్మెంట్‌కు 14 చొప్పున ఈవీఎం టేబుల్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు సంబంధించి అసెంబ్లీ నియోజకవర్గాల్లో 16, సెగ్మెంట్స్‌కు సంబంధించి ప్రత్యేక హాలులో 14 టేబుళ్లు ఏర్పాటు చేశారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 22,669 పోస్టల్ బ్యాలెట్లు పోల్‌కాగా, ఎంపీ స్థానానికి 22,657 పోస్టల్ బ్యాలెట్లు పోలయ్యాయి.

124-బద్వేలు: ఈ నియోజకవర్గంలో 272 పోలింగ్ కేంద్రాలు ఉండగా, 11 రౌండ్లలో కౌంటింగ్ ప్రక్రియ పూర్తవుతుంది. ఇందుకోసం నియోజకవర్గానికి 14 ఈవీఎం టేబుల్స్, సెగ్మెంట్‌కు సంబంధించి 14 టేబుల్స్ ఉంటాయి. అసెంబ్లీకి రెండు పోస్టల్ బ్యాలెట్ టేబుళ్లు ఉండగా, సెగ్మెంట్(ఎంపీ పరిధి)కు సంబంధించి అన్ని నియోజకవర్గాలకు కలిపి 14 టేబుళ్లు ఏర్పాటు చేశారు. ఈ అసెంబ్లీ స్థానంలో 3077 పోస్టల్ బ్యాలెట్లు, సెగ్మెంట్‌లో కూడా 3077 పోస్టల్ బ్యాలెట్లు పోలయ్యాయి.

126-కడప: ఈ నియోజకవర్గంలో 287 పోలింగ్ కేంద్రాలకుగాను 21 రౌండ్లలో ఓట్ల లెక్కింపు పూర్తవుతుంది. 14 చొప్పున అసెంబ్లీ, సెగ్మెంట్ ఈవీఎం టేబుళ్లు ఉంటాయి. ఇక అసెంబ్లీకి 5637, సెగ్మెంట్‌కు 5632 పోస్టల్ బ్యాలెట్లు నమోదయ్యాయి.

129-పులివెందుల: ఈ నియోజకవర్గంలో 301 పోలింగ్ కేంద్రాలు ఉండగా 22 రౌండ్లలో ఓట్ల లెక్కింపు పూర్తవుతుంది. ఇందుకోసం అసెంబ్లీకు 14, సెగ్మెంట్‌కు 14 చొప్పున టేబుళ్లు ఉంటాయి. ఈ నియోజకవర్గంలో అసెంబ్లీకి 2862, సెగ్మెంట్‌కు 2862 పోస్టల్ బ్యాలెట్లు పోలయ్యాయి.

130- కమలాపురం: ఈ నియోజకవర్గంలో 251 పోలింగ్ కేంద్రాలకుగాను 18 రౌండ్లలో ఓట్ల లెక్కింపు పూర్తి చేస్తారు. ఇందుకోసం అసెంబ్లీకి, సెగ్మెంట్‌కు 14 చొప్పున టేబుళ్లు ఏర్పాటు చేశారు. ఈ నియోజకవర్గంలో అసెంబ్లీకి 2009, సెగ్మెంట్‌కు 2008 పోస్టల్ బ్యాలెట్లు వచ్చాయి.

131-జమ్మలమడుగు: ఈ నియోజకవర్గంలో 315 పోలింగ్ కేంద్రాలు ఉండగా 23 రౌండ్లలో ఓట్ల లెక్కింపు పూర్తవుతుంది. 14 చొప్పున అసెంబ్లీ నియోజకవర్గం, సెగ్మెంట్‌కు ఈవీఎం టేబుళ్లు ఉంటాయి. ఈ నియోజకవర్గంలో అసెంబ్లీకి 2924, సెగ్మెంట్‌కు కూడా 2924 పోస్టల్ బ్యాలెట్లు వచ్చాయి.

132- ప్రొద్దుటూరు: ఈ నియోజకవర్గంలో 268 పోలింగ్ కేంద్రాలకుగాను 20 రౌండ్లలో ఓట్ల లెక్కింపు పూర్తవుతుంది. అసెంబ్లీ నియోజక వర్గానికి 14, సెగ్మెంట్‌కు 14 చొప్పున ఈవీఎం టేబుళ్లు ఉంటాయి. ఈ నియోజకవర్గంలో అసెంబ్లీకి 3613, సెగ్మెంట్‌కు 3609 చొప్పున పోస్టల్ బ్యాలెట్లు నమోదయ్యాయి.

133- మైదుకూరు: ఈ నియోజకవర్గంలో 269 పోలింగ్ స్టేషన్లు ఉండగా, 20 రౌండ్లలో కౌంటింగ్ ప్రక్రియ పూర్తవుతుంది. 14 చొప్పున అసెంబ్లీ నియోజకవర్గం, సెగ్మెంట్లకు సంబంధించిన ఈవీఎం టేబుళ్లు ఉంటాయి. అసెంబ్లీ నియోజకవర్గానికి 2547 పోస్టల్ బ్యాలెట్లు, సెగ్మెంట్‌కు 2545 పోస్టల్ బ్యాలెట్లు వచ్చాయి.

కౌంటింగ్‌కు పటిష్ట ఏర్పాట్లు

కమలాపురం: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ పేర్కొన్నారు. జూన్ నెల 4 వ తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో కమలాపురం నియోజకవర్గ కౌంటింగ్‌కు సంబంధించి చేపట్టాల్సిన బందోబస్తు ఏర్పాట్లపై కమలాపురం పోలీస్ స్టేషన్‌లో పోలీసు అధికారులతో ఎస్పీ మంగళవారం సూక్ష్మ స్థాయి సమీక్ష నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. కౌంటింగ్ సందర్భంగా క్షేత్ర స్థాయిలో ఎక్కడెక్కడ, ఎవరు , ఎలా విధులు నిర్వర్తించాలో ఆదేశాలు ఇచ్చారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ కౌంటింగ్ నేపథ్యంలో జూన్ 1వ తేదీ నుంచి 6 వ తేదీ వరకు ఎలాంటి ఊరేగింపులూ, విజయోత్సవ ర్యాలీలు నిర్వహించడానికి అనుమతి లేదని అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా రాజకీయ నేతల గృహ నిర్బంధాలు, జిల్లా బహిష్కరణ అమలు చేస్తామని వివరించారు. శాంతి భద్రతలకు భంగం కలిగించినవారిపై నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కడప డీఎస్పీ ఎండీ షరీఫ్, నియోజకవర్గ నోడల్ అధికారి, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సుధాకర్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ రాజు, కమలాపురం సీఐ రామ క్రిష్ణారెడ్డి, సీకేదిన్నె సీఐ శంకర్ నాయక్, కడప రూరల్ సీఐ పార్థ సారథి, ఎస్ఐలు హృషీ కేశవరెడ్డి, వెంకట రమణ, హరి ప్రసాద్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ప్రసాద్‌గౌడ్



కడప వైఎస్ఆర్ సర్కిల్ : బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా ప్రసాద్ గౌడ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుడంరెడ్డి బాబు ఇచ్చిన బాధ్యతలను శక్తివంచన లేకుండా నిర్వర్తిస్తానన్నారు. బీసీల సమస్యలపై పోరాడేందుకు ముందుంటానని తెలిపారు. బీసీ కార్పొరేషన్‌కు రావాల్సిన నిధులు, వసతి గృహాలు, ఇతర అంశాలపై పోరాటం చేస్తామన్నారు.

కంటి క్యాన్సర్‌పై అప్రమత్తత అవసరం

– నిపుణులు డాక్టర్ కావ్య ఎం.బెజ్జంకి

కడప కోటిరెడ్డిసర్కిల్ : రె టినో బ్లాస్టోమా అనే కంటి క్యాన్సర్‌పై పిల్లల తల్లితండ్రులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కంటి కేన్సర్ నిపుణులు డాక్టర్ కావ్య ఎం.బెజ్జంకి తెలిపారు. ప్రపంచ రెటినో బ్లాస్టోమా కంటి క్యాన్సర్ అవగాహన వారోత్సవం సందర్భంగా మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడారు. ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్(ఎల్వీపీఈఐ) ఆధ్వర్యంలో ఏటా పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రతి ఏడాది వైట్ థాన్ పేరిట పరుగు, నడక కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కంటి క్యాన్సర్‌కు అత్యంత ఖరీదుతో కూడిన దీర్ఘకాల వైద్య సేవలు పొందాల్సి ఉంటుందన్నారు. 'వైటాథాన్' ద్వారా సేకరించిన నిధులతో 2000 మందికి చికిత్స అందిస్తున్నామన్నారు. రెటినోబ్లాస్టోమాను ముందుగానే గుర్తించి, చికిత్స చేస్తే పిల్లల దృష్టిని కాపాడవచ్చని తెలియజేశారు.

కూలిన విద్యుత్తు స్తంభం



కూలిన విద్యుత్తు స్తంభం

పెద్దముడియం : మండలంలోని బలపనగూడూరు సమీపంలో ఈదురుగాలులతో కూడిన వర్షాలకు విద్యుత్తు స్తంభం కూలిపోయింది. రెండు మేకలు స్తంభం కింద పడి మృతి చెందాయి. స్తంభం కూలుతున్న సమయంలో 20 అడుగుల దూరంలో ప్రయాణికులతో కూడిన ఆటో బలపనగూడూరు గ్రామానికి వస్తోంది. కొన్ని సెకన్ల ముందే స్తంభం కూలిపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. మరోసారి ప్రమాదం జరగకముందే వంగిపోయిన స్తంభాలను సరిచేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

తాటి ముంజెలు.. లాభాలు బోలెడు

వేసవి వచ్చిందంటే ప్రతి ఒక్కరూ ఇష్టపడి తినే వాటిలో తాటి ముంజెలు ఒక్కటి. శరీరాన్ని చల్లబరిచే గుణం ఉండడంతో పిల్లల నుంచి పెద్దల వరకూ ఇష్టపడతారు. ఎండలు తీవ్రంగా ఉన్నప్పుడు ఇవి తీసుకుంటే శరీరాన్ని డీ హైడ్రేషన్ బారి నుండి కాపాడుతుందని వారి నమ్మకం. ఓ మోస్తరు వర్షం కురుస్తున్నా.. వేడి తగ్గకపోవడంతో తాటి ముంజలు కొనేందుకు జనం ఎగబడుతున్నారు. ఇది ఆసరాగా పల్లెల నుంచి పెద్ద ఎత్తున తీసుకువచ్చి నగరంలో విక్రయిస్తున్నారు.



నిగనిగలాడుతున్న తాటి ముంజెలు



కాయల నుంచి ముంజెలను తీస్తున్న అమ్మకం దారులు

కడప అగ్రికల్చర్–కడప కోటిరెడ్డి సర్కిల్ : జిల్లాలో ఓ మోస్తరు వర్షాలు కురుస్తున్నప్పటికీ.. వేడి సెగలు తగ్గడం లేదు. జనం ఇంకా ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. వేసవి తాపం నుంచి సేద తీరేందుకు తాటి ముంజెలు కొనుగోలు చేస్తున్నారు. తాటి బోదను కలపగా, ఆకులను ఇళ్ల పైకప్పు, విసనకర్రలుగా వినియోగిస్తారు.అయితే గత కొద్ది రోజులుగా గ్రామీణ ప్రాంతాల నుంచి ఆటోలో తాటికాయలు తీసుకువచ్చి కడప నగరంలోని ప్రధాన కూడళ్లలో విక్రయిస్తున్నారు. పైగా వీటితో అనేక లాభాలున్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. డజన్ తాటి ముంజెల ధర రూ.100 పలుకుతోంది. రోజుకు 50–70 డజన్ల వరకు అమ్ముతున్నట్లు విక్రయదారులు చెబుతున్నారు.

తాటిముంజెలతో లాభాలివే..

- తాటి ముంజెల్లో అధిక శాతం తేమ ఉండడంతో శరీర ఉష్ణోగ్రత తగ్గిస్తుంది.
- తక్కువ క్యాలరీలు, ఎక్కువ కాల్షియం, ప్రొటీన్లు, ఐరన్, ఇతర విటమిన్లు ఉంటాయి.
- వేడిమితో బాధపడేవారంతా ఇవి తీసుకుంటే డీ హైడ్రేషన్ నుంచి రక్షిస్తుంది.
- ఎసిడిటీ, మలబద్ధకం, అల్సర్ సమస్యలను నివారిస్తూనే జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి.
- వేసవిలో దద్దుర్లు, అలర్జీ వస్తుంటుంది. ముంజెలు తిన్నా, గుజ్జను రాసుకున్నా చర్మం పాడిబారే సమస్యను నివారిస్తాయి.

వంద గ్రామలు తాటిముంజెల నుంచి అందే పోషకాలివి...	
నీరు	87.6 గ్రాములు
శక్తి	43 క్యాలరీలు
పీచు	1 గ్రాము
పిండి పదార్థాలు	10.9 గ్రాములు
కొవ్వులు	0.1 గ్రాము
ఐరన్	1 గ్రాము
ప్రొటీన్లు	0.8 గ్రాములు
కాల్షియం	27 మిల్లీగ్రాములు
ఫాస్పరస్	30 మిల్లీగ్రాములు
మెగ్నీషియం	10 మిల్లీగ్రాములు
సోడియం	20 మిల్లీగ్రాములు
పోటాషియం	150 మిల్లీగ్రాములు
విటమిన్ – సి	5 మిల్లీగ్రాములు

సింహ వాహనంపై చెన్నకేశవుడు



సింహవాహనంపై ఊరేగుతున్న శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి

రాజుపాళెం : ప్రసిద్ద పుణ్యక్షేత్రమైన వెల్లాలలోని చెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వరస్వామి ఆలయాల్లో బ్రహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం స్వాముల వారికి విశేష అభిషేకాలు, అర్చన చేసి అలంకరించారు. శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామిని పల్లకిలో ఊరేగించారు. రాత్రి స్వామి, అమ్మవారి ఉత్సవ మూర్తులను సింహ వాహనంపై ఆశీనులను చేసి ఆలయ మాడ వీధుల్లో మంగళ వాయిద్యాల నడుమ భక్తి శ్రద్ధలతో ఊరేగించారు. ఆలయ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, ఈఓ నరసయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉభయదాతలు, భక్తులు స్వాములను దర్శించుకుని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రామ్మోహన్, అర్చకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నందివాహనంపై అగస్త్యేశ్వరస్వామి



నంది వాహనంపై శ్రీగంగారాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరస్వామి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం వేకువ జామున అగస్త్యేశ్వరస్వామికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించి అలంకరించారు. సాయంత్రం గంగారాజరాజేశ్వరీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఉత్సవమూర్తులను నంది వాహనంపై, అభయ వరద సీతారామచంద్రస్వామి ఉత్సవ మూర్తులను గరుడ వాహనంపై ఆశీనులనుచేసి పురవీధుల్లో ఊరేగించారు. యడవల్లి రమణయ్య పర్యవేక్షణలో యడవల్లి యశ్వంత్‌కుమార్, జానకి బృందం, శ్రీచాయపతి పావని గ్రూప్ వారిచే శివ భక్తి గానలహరి అందరినీ అలరించింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ, దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శంకర్ బాలాజీ, ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి పాల్గొన్నారు.

7న దళితమిత్ర రాష్ట్ర మహా సభ



సన్నాహక సమావేశంలో పాల్గొన్న దళితమిత్ర సంఘ ప్రతినిధులు

కడప సెవెన్‌రోడ్స్ : ఆంధ్ర ప్రదేశ్ దళితమిత్ర సంఘం రాష్ట్ర మహాసభ అక్టోబరు 7న నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కె.రామాంజనేయులు అన్నారు. కడప నగరంలోని ఆ సంఘం కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో రామాంజనేయులు మాట్లాడుతూ అనంతపురం జిల్లా పామిడిలో రాష్ట్ర మహాసభ నిర్వహించనున్నామని తెలిపారు. వివిధ జిల్లాలు, మండలాల కమిటీల ఏర్పాటు గురించి సంఘం నాయకులతో ఆయన మాట్లాడారు. ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. వివిధ జిల్లాల నుంచి కార్యకర్తలను పెద్ద సంఖ్యలో తరలించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.రమేష్, అధికార ప్రతినిధి పెదబల్లె నాగభూషణం, అన్నమయ్య, సత్యసాయి జిల్లాల ఇన్‌ఛార్జులు లేపాక్షి ఓబులేస్, మహిళా సమాఖ్య అధ్యక్ష, ఉపాధ్యక్షులు బుజ్జమ్మ, అమరేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లపై ప్రధాని మాటలు అవాస్తవం



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఇండియా కూటమి అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను ముస్లింలకు ఇస్తారని ప్రజలను మభ్యపెడుతూ ప్రధాని మోడీ చెప్పిన మాటలు అవాస్తవమని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి పేర్కొన్నారు. నగరంలోని హోచిమన్ భవన్‌లో మంగళవారం ఏఐటీయూసీ జిల్లా స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాగసుబ్బారెడ్డి మాట్లాడుతూ దేవాలయాలు బుల్డోజర్‌తో కూలుస్తారని చెప్పడం సిగ్గుచేటు అన్నారు. దేశంలో లౌకిక పార్టీలు, ప్రజాస్వామ్య శక్తులు ఈ అంశంపై మాట్లాడాలన్నారు. 30 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నా.. ప్రభుత్వ రంగాన్ని బడా కార్పొరేట్ వ్యక్తులకు అమ్మివేసారన్నారు. దివంగత సీఎం వైఎస్.రాజశేఖర్ రెడ్డి, ఎన్టీరామారావులు లౌకిక వ్యవస్థపై గట్టిగా మాట్లాడారని, నేటి నాయకులు లౌకిక వ్యవస్థ పరిరక్షణకు పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో కేసీ.బాదుల్లా, పి.మల్లికార్జునరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, మద్దిలేటి, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

మూల్యాంకన కేంద్రాల తనిఖీ



మూల్యాంకన కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న వైవీయూ వీసీ, సీఈ

వైవీయూ : యోగి వేమన విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న సమాధాన పత్రాల మూల్యాంకన కేంద్రాన్ని వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, వైవీయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్.ఈశ్వర్ రెడ్డితో కలిసి మంగళవారం పరిశీలించారు. మూల్యాంకన విధులకు వచ్చిన అధ్యాపకుల సౌకర్యాలపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ నిర్ణీత సమయానికి మూల్యాంకనం పూర్తిచేసి, త్వరితగతిన ఫలితాలు ఇవ్వడంతోపాటు విద్యా సంవత్సరం సరైన సమయంలో ప్రారంభించాలని కోరారు. సమాధాన పత్రాలు దిద్దేటప్పుడు క్షుణ్ణంగా గమనించి ప్రతిభావంతులకు న్యాయం జరిగేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మూల్యాంకన ప్రణాళిక గురించి కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య ఎన్.ఈశ్వర్ రెడ్డి వివరించారు.

రైతుల సమస్యలపై సమరశీల పోరాటం



కొల్లి నాగేశ్వరరావు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రైతుల సమస్యలపై రాజీలేని సమరశీల పోరాటాలు చేయడమే కొల్లి నాగేశ్వరరావుకు ఘనమైన నివాళి అని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర అన్నారు. కొల్లి నాగేశ్వరరావు వర్ధంతి సందర్భంగా కడప నగరంలోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చంద్ర మాట్లాడుతూ కొల్లి నాగేశ్వరరావు విద్యార్థి దశ నుంచే 'విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు' నినాదంతో నడిచిన ఉద్యమంలో కీలక పాత్ర పోషించారన్నారు. కరవు నివారణకు నీటి ప్రాజెక్టుల నిర్మాణం జరగాలని.. సమగ్రమైన అధ్యయనం చేసి జల దర్శిని తీసుకువచ్చారన్నారు. పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, డాక్టర్ స్వామినాథన్ కమిటీ సిఫారసులు అమలు చేయాలని చేసిన పోరాటాలకు ఆయన నాయకత్వం వహించారన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంవి.సుబ్బారెడ్డి, టి.మనోహర్ రెడ్డి, ఎస్.శంకర్‌రెడ్డి, కట్టా యానాదయ్య, బాలచంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

25న గురుకులాల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్

కడప రూరల్ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో 2024–25 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్మీడియట్‌లో(ఇంగ్లీషు మీడియం) ప్రవేశాలకు ఈ నెల 25న కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కోఆర్డినేటర్ ఎల్.మాధవీలత తెలిపారు. జిల్లా పరిధిలోని లక్కిరెడ్డిపల్లె గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్‌కు ఈ నెల 25న ఉదయం 9 గంటల నుంచి కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందన్నారు. 5వ తరగతిలో ప్రవేశాలకు సంబంధించి బాలురకు బ్రహ్మంగారి మఠం, గండి క్షేత్రం, పులివెందుల, సగిలేరు, బ్రహ్మంగారిమఠం నాబార్డు స్కూల్ (కొత్తది), రామాపురం, రైల్వేకోడూరు, బాలికలకు కడప చిన్నచౌక్, పులివెందుల, కమలాపురం, కొండాపురం, మడకలవారిపల్లె, రాజుపాలెం, తొండూరు, గుండ్లకుంట, అడపూరు, దేవపట్ల, లక్కిరెడ్డిపల్లె, రాయచోటి గురుకుల పాఠశాలల్లో కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. బాలురు 231, బాలికలకు 278 సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు నాలుగో తరగతి స్టడీ సర్టిఫికెట్, కుల, ఆదాయం ధృవీకరణ పత్రం, ఇంటర్మీడియట్ ప్రవేశాలకు సంబంధించి ఆధార్, ఎస్ఎస్‌సీ మార్క్స్ మెమో, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలతో పాటు స్టడీ సర్టిఫికెట్స్ తీసుకురావాలని పేర్కొన్నారు.

ఫర్నిచర్ ధ్వంసం కేసులో ఐదుగురి అరెస్టు



పోలీసుల అదుపులో నిందితులు

రాయచోటి టౌన్ : ఈ నెల 16వ తేదీన రాయచోటి మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు ఇంటిలోకి చొరబడి వాహనాలు, ఫర్నీచర్ ధ్వంసం చేసిన ఘటనలో 15న ఆరుగురిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. జిల్లా ఎస్పీ కృష్ణారావు ఆదేశాల మేరకు మంగళవారం మరో ఐదుగురిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. స్కార్పియో ఏపీ03 బివి 2226 జీపును సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితులకు ఈ నెల 29వ తేదీ వరకు రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడిన వారిలో పప్పిరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి, మీసాలరెడ్డి శ్రావణ్, కాలేపల్లె వెంకట శివారెడ్డి, ముదిరిన రారాజు, పసుపులేని శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఉరి వేసుకుని ఎలక్ట్రీషియన్ ఆత్మహత్య



మహబూబ్‌బాషా (ఫైల్)

మదనపల్లె : ఉరివేసుకుని ఎలక్ట్రీషియన్ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం మదనపల్లె మండలంలో జరిగింది. నీరుగట్టువారిపల్లె వెంకటేశ్వరపురంలో నివాసముంటున్న మిఠాయి వ్యాపారి హైదర్‌వలి, దిల్‌షాద్ దంపతుల కుమారుడు ఎస్.మహబూబ్‌బాషా(29) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఎనిమిదేళ్ల క్రితం చీకలగుట్టకు చెందిన సమియా సుల్తానాను మొదటి వివాహం చేసుకోగా, వీరికి నాసిర్(5) కుమారుడు ఉన్నాడు. ఆమెతో విభేదాలు వచ్చి రెండేళ్ల క్రితం విడాకులు తీసుకున్నారు. ఈ క్రమంలో మూడునెలల క్రితం కోళ్లబైలు పంచాయతీ బయ్యారెడ్డికాలనీకి చెందిన దస్తగిరి, అంబాజీల కుమార్తె భానును రెండో వివాహం చేసుకున్నాడు. ఆమె తండ్రి అనారోగ్యంతో మృతి చెందడంతో నెలరోజుల నుంచి ఆమె పుట్టింట్లోనే ఉంటోంది. పది రోజులుగా మహబూబ్‌బాషా భార్య దగ్గరకు వెళ్లకుండా తండ్రితో కలిసి మిఠాయి వ్యాపారానికి వెళ్లాడు. మంగళవారం మధ్యాహ్నం అత్తగారిల్లు అయిన బయ్యారెడ్డి కాలనీలోని భార్య వద్దకు వెళ్లాడు. నగదు విషయమై భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. మనస్తాపం చెందిన మహబూబ్‌బాషా అక్కడే ఇంట్లో తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. తమ కొడుకు ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదని అతడి తల్లిదండ్రులు పోలీసులను కోరారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా సీఐ ఎన్.శేఖర్ తెలిపారు.

గడువు దాటిన సిలిండర్‌తో జాగ్రత్త..!

- అప్రమత్తతతో ప్రమాదాలు దూరం
- గడువు తేదీపై అవగాహన తప్పనిసరి
- జాగ్రత్తలతో గృహిణులకు లాభం

ఎర్రగుంట్ల : నిత్యావసరాల్లో వినియోగించే ప్రతి వస్తువుకూ గడువు తేదీ ఉంటుంది. కాలం చెల్లిన ఈ సిలిండర్ వినియోగించడం ప్రమాదకరం. వినియోగదారులు దీనిపై అవగాహన పెంచుకుంటే ప్రమాదం నుంచి బయటపడే అవాశం ఉంటుంది.

గడువు తీరితే ప్రమాదమే...

గ్యాస్ సిలిండర్‌ను నెలల తరబడి వాడకుండా నిల్వ ఉంచుతారు. మరింత మంది బ్లాక్‌లో కొని వాడుతుంటారు. అయితే సిలిండర్‌పై గుర్తించిన గడువు తేదీ లోపు వాడితే ఉత్తమం. కాలం చెల్లిన సిలిండర్లు వాడితే ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉంటున్నాయని నిపుణులు చెబుతున్నారు. అలాంటి వాటిని సంబంధిత డీలర్‌కు తిరిగి ఇచ్చేయాలి.

ముగింపు తేదీని గుర్తించాలిలా..

ప్రతి ఇంట్లో ముఖ్యమైన వస్తువు గ్యాస్ సిలిండర్. ముందుగా గ్యాస్ సిలిండర్ గడువు తేదీ గుర్తించాలి. రింగ్‌కు కింది భాగంలో తేదీ ముద్రించి ఉంటుంది. ఏడాదిలోని 12 నెలలను నాలుగు భాగాలుగా విభజించి ఆంగ్ల భాషలోని ఏ, బి, సి, డి అక్షరాలను రాస్తారు. జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలకు ఎ, ఏప్రిల్, మే, జూన్ నెలలను బిి, జూలై , ఆగస్టు, సెప్టెంబరు నెలలకు, ×సిి, అక్టోబరు, నవంబరు, డిసెంబరు నెలలకు ×డిిని రాస్తారు. ఉదాహరణకు సిలిండర్‌పై బి–17 అని రాసి ఉంటే అది 2017 జూన్ వరకే వినియోగించాలని అర్థం. ఆ నెల దాటితే సిలిండర్ కాలం చెల్లిందని తెలుసుకుని దూరంగా పెట్టాలి. ఖాళీ సిలిండర్లకు నిర్దిష్ట కాలపరిమితి ఉంటుంది. ఇది వినియోగదారులకు సంబంధం లేదు. తయారీదారులు తమ వద్ద రికార్డుల్లో లేని బ్యాచ్ నంబర్ల ప్రకారం ఏడేళ్ల దాటిన వాటిని వెనక్కు తెప్పించుకుని పరీక్షించి, నాణ్యత లేని వాటిని పక్కన పెట్టేస్తారు.



సిలిండర్‌పై ఉన్న ఎక్స్‌పైరీ తేదీ గుర్తించాల్సిన చోటు ఇదే..